సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం । 28 । సెప్టెంబర్ । 2023



కమనీయం రంగనాథుడి కల్యాణం

పులివెందుల సమీపంలో శ్రీరంగనాథస్వామి కల్యాణం బుధవారం కన్నుల పండువగా జరిగింది. -8లో..



సెంట్రల్ జోన్ జట్టు విజయం

కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన ఏసీఏ అండర్-23 అంతర్ జోనల్ వన్డే క్రికెట్ టోర్నీలో సెంట్రల్‌జోన్ విజయం సాధించింది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.98	రూ.124
రెండోరకం	రూ.56	రూ.94



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 366 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	390	533
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 424.420 కిలోలు

న్యూస్‌రీల్

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లు

వాల్మీకిపురం: ఒప్పంద ఉద్యోగుల రెగ్యులరైజ్ బిల్లును అసెంబ్లీలో ఆమోదించడంతో ఒప్పంద అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక పీవీసీ జూనియర్ కళాశాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి బుధవారం క్షీరాభిషేకం చేశారు. కాంట్రాక్టు లెక్చరర్లు శేఖర్, ప్రసాద్, రమణ, నరసింహులు, స్వప్న, హేమలత పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు



శ్రీ దేవర రాయి నల్లగంగమ్మ తల్లి హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

సంబేపల్లి: సంబేపల్లి గ్రామంలోని శ్రీ నల్లగంగమ్మ దేవర రాయి నల్లగంగమ్మ తల్లి హుండీ ఆదాయం రూ. 2,38,324లు వచ్చిందని దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, ఈఓ కొండారెడ్డి తెలిపారు. మే 26, 2023 వ తేది నుంచి సెప్టెంబర్ 27, 2023వ తేది వరకు ఈ హుండీ లెక్కింపు చేపట్టారు. వచ్చిన మొత్తాన్ని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో జమ చేయనున్నట్లు ఈఓ కొండారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు వివి ప్రతాప్ రెడ్డి, సర్పంచ్ అంచల రామచంద్ర, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న డీఈఓ పురుషోత్తం

రాజంపేట టౌన్: నాడు-నేడు పనులను మరింత వేగవంతం చేయాలని డీఈఓ ఎస్.పురుషోత్తం తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో బుధవారం రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లోని ఆరు మండలాల ఎంఈఓలు, నాడు-నేడుకు ఎంపికై న పాఠశాలల హెచ్‌ఎంలతో నిర్వహించిన సమావేశంలో డీఈఓ మాట్లాడారు. నాడు-నేడు ఫేస్-2కు సంబంధించిన బిల్లులను ప్రతి మంగళవారం నుంచి శుక్రవారంలోపు ఎస్‌టీఎంఎస్‌లో కన్‌ఫాం చేసుకోవాలన్నారు. ఈనెల 30లోపు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇన్‌స్పైర్‌కు నామినేషన్లు పంపాలని ఆదేశించారు. ఎంఈఓలు కొండూరు రఘునాథరాజు, జి.చక్రధర్‌రాజు, రామయ్య, నాగయ్య, కోదండనాయుడు, గిరివరదయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఉత్తమ పౌరులుగా ఎదగాలి

నందలూరు (రాజంపేట): ప్రతి ఒక విద్యార్థి చక్కగా విద్యను అభ్యసించి ఉత్తమ పౌరులుగా ఎదగాలని శ్రీరాం పురుషోత్తం అన్నారు. భారత స్వాతంత్ర్య అమృతోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న నాభూమి-నా దేశం కార్యక్రమం బుధవారం నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈ కార్యక్రమానికి డీఈఓ విచ్చేసి ప్రసంగించారు. స్కాట్ యూనియన్ స్థాయి ఆటల పోటీలలో గెలుపొందిన లక్ష్మీ పూజిత, షాదాబ్, మణికంఠ, హర్షవర్ధన్, అశోక్‌లను డీఈఓ అభినందించారు.

మిగిలింది మూడు రోజులే!

రెండువేల నోట్లను మార్చుకునే తుది గడువు ముంచుకొస్తోంది. దీంతో బ్లాక్‌ను వైట్ చేసుకునేందుకు బడాబాబులు రకరకాల మార్గాలను అనుసరిస్తున్నారు. సరైన ఆధారాలు ఉంటే అకౌంట్‌లో డిపాజిట్ చేసుకోవడమే మేలని ఆర్థికనిపుణులు సూచిస్తున్నారు. ఈ దిశగా బ్యాంకు డిపాజిట్లు పెరుగుతున్నాయి. ఉభయ జిల్లాలో ఇప్పుడు ఎటుచూసినా రెండువేల నోట్లపై చర్చ జరుగుతోంది.

- రూ. 2వేల నోటు మార్పిడికి జోరుగా యత్నాలు
- పెద్దనోట్లు మార్చుకునేందుకు పెద్దల ప్రయత్నాలు
- ఉభయ వైఎస్సార్ జిల్లాలలో భారీగా పెరిగిన బంగారు కొనుగోళ్లు
- భూములు కొనుగోలుపై మరికొందరు పెట్టుబడులు



బ్యాంకులో రూ.2వేల నోటు డిపాజిట్ చేస్తున్న ఖాతాదారులు

రాజంపేట: కేంద్రప్రభుత్వం రద్దు చేసిన రూ.2వేల నోట్ల మార్పిడికి ఇక మూడు రోజులే గడువుగా ఉంది. అంటే ఈనెల 30నాటికి 2వేల నోట్లకు కాలం చెల్లిపోయినట్లే. దీంతో పెద్దఎత్తున ప్రజలు తమ దగ్గర ఉన్న పెద్దనోట్లను మార్చుకునేందుకు బ్యాంకుల దిశగా అడుగులు వేస్తున్నారు. 30లోపు మార్చుకోవాలన్న నిబంధనతో బడాబాబులు రకరకాల పద్ధతులను అనుసరిస్తున్నారు. డీమానిటరైజేషన్ తర్వాత రూ.2వేల నోట్ల కనిపించకుండాపోయాయి. సాధారణ లావాదేవీలలో, బ్యాంకు ఏటీఎంలలో వీటి ఊసేలేకుండాపోయాయి. దీంతో సామాన్యులకు ఈ నోట్లతో పనిలేకుండాపోయాయి. రూ.2వేల నోట్లను రోజుకు రూ.20వేల వరకు బ్యాంకులో మార్చుకోవచ్చునని ఆర్‌బీఐ తెలిపింది. ఉన్న సెలవులతో బ్యాంకుల ద్వారా వందరోజుల్లో రూ.20లక్షలను మాత్రమే మార్చుకోవటానికి అవకాశం ఉంది.

భూములపై..

బడాబాబులు భూములపై పెట్టుబడి పెడుతున్నారు. ఎకరా సెటిల్‌మెంట్ పొలం వాల్యుయేషన్ ప్రకారం రూ.20లక్షలు ఉండగా, దానికి ప్రభుత్వం విలువ రూ.3లక్ష వరకు ఉంటుంది. ఈ భూములను కొన్నవారు ప్రభుత్వ మార్కెట్ విలువ మేరకు స్టాంపు డ్యూటీ చెల్లించి ఈ మొత్తంను వైట్‌కరెన్సీ ఇచ్చి మిగిలిన పైకాన్ని బ్లాక్‌లో ఇవ్వడం, ఇప్పుడు రూ.2వేల నోట్లలో మార్పిడి సాగుతున్న మరో తంతు. ఇవికాక పెట్రోలు బంకులు, మద్యం దుకాణాలు, అమెజాన్ లాంటి ఆన్‌లైన్ వ్యాపారాలలో పేఆన్ డెలివరీ లాంటి ద్వారా నోట్ల మార్పిడి సాగుతోంది.

20 శాతం పైగా పెరిగిన అమ్మకాలు..

బడాబాబు బంగారు కొనుగోలు చేసేపనిలో పడ్డారు. ఉభయజిల్లాలోని ప్రొద్దుటూరు, కడప, రాయచోటి, మదనపల్లె, రాజంపేట తదితర ప్రాంతాల్లో బంగారు అమ్మకాలు పెరిగాయి. ఆభరణాలను కొంటే మేకింగ్‌చార్జి, తరుగు వంటివి ఉంటుంది. కేవలం బిస్కట్లు, కాయిన్స్‌గా కొంటున్నారని తెలుస్తోంది. ఇదే అదనుగా బంగారు దుకాణదారులు గ్రామంపై అధికంగా ఇస్తేనే రూ.2వేల నోట్లను తీసుకుంటామనే షరతులు పెడుతున్నట్లు తెలుస్తోంది.

బ్యాంకు డిపాజిట్లు...

రోజుకు రూ.20వేల వరకు రూ.2వేల నోట్లను డిపాజిట్ చేయాల్సిన నిబంధన ఉంది. దీని వలన తమ వద్ద నున్న పెద్దమొత్తంను మార్చుకోవాలంటే వీలుకాని పరిస్థితి. డిపాజిట్లకు మాత్రం నిబంధనలు లేవు. దీంతో బ్యాంకులలో డిపాజిట్లు పెరిగిపోయాయి. కొందరు బంధువులు బ్యాంకులలో పెట్టిన బంగారు నగలను విడిపిస్తున్నారు. మళ్లీ మరో వారంలో బ్యాంకులో తనఖా పెట్టి వైట్ కరెన్సీగా మార్చుకుంటున్నారు. లోపాయికారి ఒప్పందతో నోట్ల మార్పిడి కోసం కమిషన్ ఏజెంట్లు కూడా తెరపైకి వచ్చేశారు.

30లోపు బ్యాంకులో డిపాజిట్ చేసుకోవచ్చు



రూ.2వేల నోట్లను ఈనెల 30 వరకు మార్చుకునేందుకు, అకౌంట్‌లో వేసుకునేందుకు వీలుంది. ఆర్‌బీఐ ఆదేశాల మేరకు బ్యాంకుల్లో ఇప్పటికే రూ.2వేల నోట్లను తీసుకోవడం జరుగుతోంది. నిబంధనల మేరకు బ్యాంకుల్లో మార్పిడి జరుగుతోంది. 30వ తేది తర్వాత ఆర్‌బీఐ చెప్పిన ప్రకారం రూ.2వేల నోటు చెల్లకపోవచ్చు. – వెంకటేశ్వరరెడ్డి, మేనేజరు, లీడ్‌బ్యాంకు, అన్నమయ్య జిల్లా

రూ.2వేల నోట్ల మార్పిడికి గడువును పెంచాలి



ఆర్‌బీఐ రూ.2వేల నోట్ల మార్పిడికి గడువును పెంచాల్సిన అవసరం ఉంది. గడువు పెంచే విషయంలో కేంద్రప్రభుత్వం పునరాలోంచించాలి. రూ2 వేల నోటు రద్దు చే యకుముందు మరో అవకాశం ప్రజలకు ఇవ్వాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది. బ్యాంకులో మార్చుకునేందుకు గడువుతోపాటు కరెన్సీని మార్చుకునేందుకు నిబంధనలు సడలించాలి. –గోవిందు నాగరాజు, గల్ఫ్ కో-కన్వీనరు, కువైట్

ఘనంగా పర్యాటక దినోత్సవాలు



మాట్లాడుతున్న జిల్లా పర్యాటక అధికారి నాగభూషణం

రాయచోటి : పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు అన్నమయ్య జిల్లాలో ఘనంగా జరిగాయి. బుధవారం రాయచోటిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపల్ శివశంకర్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పర్యాటక అధికారి నాగభూషణం మాట్లాడుతూ రాయచోటిలోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పర్యాటక రంగంలోని వివిధ రకాలుగా ఆధ్యాత్మిక, మెడికల్, టెంపుల్, ఎకో టూరిజం తదితర పర్యాటకాల గురించి అవగాహనను పెంచుకోవాలన్నారు. జిల్లాలో హార్స్‌లీహిల్స్, మల్లయ్యకొండ, గుండాల కోన తదితర ప్రదేశాలు ఎకో టూరిజంకు అనువైనవిగా ఉన్నాయన్నారు. అలాగే గుర్రంకొండ కోట, అడుపూరు బౌద్ధస్తూపాలు చరిత్రకు నిలువెత్తు నిదర్శనాలన్నారు. జిల్లాలోని ఇటువంటి పర్యాటక ప్రదేశాలను ప్రజలందరూ సందర్శించాలన్నారు. అనంతరం సెప్టెంబర్ 26న నిర్వహించిన వ్యాస రచన, వకృత్వపు పోటీల బహుమతులను విద్యార్థులకు ప్రదానం చేశారు. జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి భరత్‌కుమార్‌రెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ పాల్గొన్నారు.

సిద్దవటం: చారిత్రక మట్లి రాజుల కోట కొలువైన సిద్దవటంలో బుధవారం పర్యాటక దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కడప డీఎల్‌పిఓ మస్తాన్‌వలీ హాజరయ్యారు. ఈ సందర్భంగా మట్లిరాజుల కోట ముఖ ద్వారం నుంచి ర్యాలీ నిర్వహించారు. మట్టిరాజుల కోటలో పరిశుభ్రత పనులను చేపట్టారు.

అందరికీ ఆమోదయోగ్యంగా పునరావాసం

కలెక్టర్ గిరీషా పీఎస్



మంగంపేట ఆర్‌ఆర్ 5 లే అవుట్‌లు పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీషా పీఎస్

ఓబులవారిపల్లె: మంగంపేట కాపుపల్లె, హరిజనవాడ, అరుంధతీవాడ, గ్రామాల ప్రజలకు అమోదయోగ్యంగా ఉండేలా పునరావాసం ఏర్పాట్లు జరుగుతున్నాయని కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. బుధవారం మంగంపేట ఆర్‌ఆర్ 5 నందు పునరావాసం కోసం ఏర్పాటు చేసిన లే అవుట్‌లను ఆయన పరిశీలించారు. పునరావాసం కోసం పనులను వేగవంతంగా నిర్వహించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. పనులలో జాప్యం జరుగకుండా అనుకున్న సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం గ్రామస్తులతో ఏపీఎండీసీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. గ్రామస్తుల కొరిక మేర కొన్ని మార్పులు చేర్పులను పరిశిలించాలని అధికారులను ఆదేశించారు. అంతకు ముందు ఆర్‌ఆర్ ఫైవ్‌లో రోడ్లు,పార్కు, వాటర్ ట్యాంక్ నిర్మాణపనులు, ప్లాట్‌లను అధికారులు, గ్రామస్తులతో ఆనయ పరిశీలించి పలు సూచనలు చేశారు తహసీల్దార్ పుల్లరెడ్డి, సీపీఓ సుదర్శన్‌రెడ్డి, ఎంపీడీఓ విజయారావు,హౌసింగ్ డీఈ కుప్పుస్వామి, మంగంపేట గ్రామస్తులు గుత్తిరెడ్డి హరినాథ్ రెడ్డి, పులపత్తురి రామసుబ్బారెడ్డి, డీఆర్‌సీసీయూ మెంబర్ తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ మినుగుసుధాకర్, వైఎస్సార్ సీపీ నాయకులు గజ్జల శ్రీనివాసులరెడ్డి, ఎంపీటీసీ హరిబాబు,ఎంపీఎండీసీ అధికారులు, అన్నిశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరి ఆరోగ్యం కోసం జగనన్న ఆరోగ్య సురక్ష

రాయచోటి: జిల్లాలోని ప్రతి ఒక్కరి ఆరోగ్యం కోసం జగనన్న ఆరోగ్య సురక్ష మొదటి అడుగు మాత్రమే అని కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించబడిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ముఖ్యమంత్రి కార్యాలయ స్పెషల్ చీఫ్ సెక్రటరీ పూనం మాలకొండయ్య, ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో బుధవారం సాయంత్రం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆరోగ్యశ్రీ కార్యక్రమంతో అనుసంధానం చేసి అనారోగ్యంతో బాధపడే వారికి పూర్తి ఆరోగ్యాన్ని అందించే కార్యక్రమమని కలెక్టర్ తెలిపారు. సంపూర్ణ ఆరోగ్య అన్నమయ్య జిల్లాగా మొదటి అడుగు వేయాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రాలను ఏర్పాటు చేసే ప్రాంతాలలో అన్ని సదుపాయాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమాన్ని నిర్వర్తించేలా సిద్ధమవ్వాలని అధికారులను ఆదేశించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, గ్రామ వార్డు సచివాలయ శాఖ అధికారి మనోహర్‌రాజు, డీఎంఅండ్ హెచ్‌ఓ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

సీడీసీ డీన్‌గా రఘుబాబు

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం కళాశాల అభివృద్ధి మండలి(సీడీసీ) డీన్‌గా ఆచార్య కె.రఘుబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వైవీయూ సీడీసీ కార్యాలయంలో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైవీయూ వీసీ, రిజిస్ట్రార్ మార్గదర్శనంలో కళాశాల అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏఎఫ్‌యూ విద్యార్థులకు పురస్కారాలు



తేజస్విని



కృష్ణారెడ్డి

ఏఎఫ్‌యూ: కడప నగరంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు దక్కాయి. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో విశ్వ విద్యాలయం ఫొటోగ్రఫీ విభాగం విద్యార్థులు వి.తేజశ్విని(గండికోట చిత్రం), సి.హెచ్ కె.వి.కృష్ణారెడ్డి(దేవరగట్టు కర్రల సమరం)లకు బుధవారం అవార్డులు అందజేశారు. వీసీ, రిజిస్ట్రార్ వారిని అభినందించారు.

సంపూర్ణ సేవలందించడమే లక్ష్యం

జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



జగనన్న చెబుదాం కార్యక్రమంలో మాట్లాడుతున్న జాయింట్‌కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

నందలూరు(రాజంపేట): ప్రజలకు సంపూర్ణంగా ప్రభుత్వ సేవలందించడమే లక్ష్యంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ క్యాంపస్‌లో ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కార్యక్రమానికి జ్యోతి ప్రజల్వన చేశారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి ప్రజలకు ప్రభుత్వం అందచేస్తున్న సేవలు ఏ మేరకు అందుతున్నాయో తెలుసుకోవడం జరుగుతోందన్నారు. ప్రభుత్వ సేవలు అర్హులకు అందించేందుకు అమలవుతున్న వ్యవస్థల పని తీరు పరిశీలనకు జగనన్న చెబుదాం కార్యక్రమం దోహదపడుతుందన్నారు. నందలూరు మండలాధ్యక్షుడు మేడా విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలను తీసుకొచ్చారని, అవి ఇప్పుడు వాటి అమలు తీరు ఏవిధంగా తెలుసుకునేందుకు జగనన్న చెబుదాం కార్యక్రమాలను దోహదపడతాయన్నారు. ఎమ్మెల్యే మేడామల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో రాజంపేట నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా జరుగుతున్నాయన్నారు. ఆర్డీవో రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ జగనన్న చెబుదాంలో వచ్చే సమస్యలను పరిశీలించి. నిబంధనలకు అనుగుణంగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు సెక్రటరీ సయ్యద్‌అమీర్, ఎంపీడీఓ సౌభాగ్య, తహసీల్దారు సత్యప్రకాశ్, మండల ఉపాధ్యక్షుడు నాయనపల్లె అనుదీప్, సర్పంచులు జంబుసూర్యనారాయణ, అక్కిరెడ్డిస్వరూప,మైనుద్దీన్,నందలూరు ఉపస్సరంచి ఇబ్బు, దళితనాయకులు ఆర్ముగంవిశ్వనాథ్, పెనుబాలనాగసుబ్బయ్య, కాకిచంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

టమాటాపై వాన దెబ్బ

- ఉమ్మడి అనంతపురం జిల్లాలో దెబ్బతింటున్న తోటలు
- 3వేలు నుంచి500మెట్రిక్ టన్నులకు పడిపోయిన స్టాకు
- ధరలు పెరిగే అవకాశం



మార్కెట్‌లో రవాణాకు సిద్ధంగా ఉన్న టమాటాలు

గుర్రంకొండ: మార్కెట్లో టమాటా ధరలు మెల్లగా పుంజుకొంటున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో కిలో టమాటా రూ.13వరకు ధర పలుకుతోంది.వారం రోజుల క్రితం టమాటా ధరలు కిలోరూ.7 నుంచి రూ.9వరకు మాత్రమే ఉండేవి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో టమాటా తోటలు దెబ్బతిన్నాయి. దీంతో అక్కడి నుంచి జిల్లాకు వచ్చే టమాటాల స్టాకు 3వేల మెట్రిక్ టన్నుల నుంచి 500 మెట్రిక్ టన్నులకు పడిపోయింది. కాగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో 15 రోజుల తరువాత టమాటా పంట దిగుబడి కాలంపూర్తిగా ముగుస్తుంది.

పుంజుకుంటున్న టమాటా ధరలు

ప్రస్తుతం జిల్లాలోని మార్కెట్‌యార్డుల్లో టమాటా ధరలు పుంజుకుంటున్నాయి. 25 కేజిల టమాటా క్రేట్ రూ.175 నుంచి రూ.225 వరకు ధరలు పలికాయి. ప్రస్తుతం మార్కెట్లో టమాటా ధరలు స్వల్పంగా పుంజుకోవడంతో కిలో టమాటా రూ. 13 వరకు టుంది. 25కేజిల టమాటా క్రేట్ ధర రూ.325 వరకు ధరలు పలుకుతున్నాయి. ప్రస్తుతం మొదటి రకం టమాటా కిలో రూ13, రెండోరకం కిలో రూ.10 మూడో రకం రూ.7వరకు ధరలు పలుకుతున్నాయి.

బయటజిల్లాలో భారీ దెబ్బ

ఉమ్మడి అనంతపురంజిల్లాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు అక్కడి టమాటా తోటలు దెబ్బతిన్నాయి. దీంతో టమాటా పంట దిగుబడులు రోజు రోజుకు తగ్గిపోతున్నాయి. పదిహేను రోజుల కిందటతో పోల్చితే 80శాతం మేరకు పంట దిగుబడి తగ్గిపోవడం గమనార్హం. పదిహేను రోజుల క్రితం వరకు ఉమ్మడి అనంతపురం జిల్లాల నుంచి మన జిల్లాకు3 వేల మెట్రిక్ టన్నుల టమాటాల స్టాకు వచ్చేది. మన జిల్లాలో ములకల చెరువు, అంగళ్లు, మదనపల్లె, గుర్రంకొండ టామటా మార్కెట్లకు ప్రతిరోజు బయట జిల్లాల నుంచి 3 వేల మెట్రిక్ టన్నుల వరకు టమాటాల స్టాకు వచ్చేది. ప్రస్తుతం 500 మెట్రిక్ టన్నుల టమాటాల స్టాకు మాత్రమే జిల్లాకు వస్తోంది. ప్రస్తుతం రోజురోజుకు టమాటా ధరలు స్వలంగా పుంజుకొంటుండడంతో రైతుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.

ధరలు పెరిగే అవకాశం



ప్రస్తుతం మార్కెట్లో టమాటా ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. వారంరోజుల కిందట వరకు అనంతపురం జిల్లా నుంచి మన జిల్లాలోని వివిధప్రాంతాల్లోని టమాటా మార్కెట్లకు రోజూ 3వేల మెట్రిక్ టన్నుల స్టాకు వచ్చేవి. ప్రస్తుతం అక్కడ నుంచి 600 నుంచి 500 మెట్రిక్ టన్నుల టమాటాల స్టాకు మాత్రమే ఇక్కడి మార్కెట్లకు వస్తున్నాయి. దీంతో ఇక్కడి మార్కెట్లలో టమాటా ధరలు పెరిగే అవకాశముంది. – జగదీష్, మార్కెట్‌కమిటీ కార్యదర్శి,వాల్మీకిపురం

క్లుప్తంగా

15 లీటర్ల సారా స్వాధీనం



నిందితుడితో సెబ్ అధికారులు

కేవీపల్లె : 15 లీటర్ల సారా తోపాటు నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పీలేరు స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) సీఐ వై. గురుప్రసాద్ తెలిపారు. మండలంలోని బురుజుకాడపల్లె అటవీ ప్రాంతంలో సారా తయారీ చేస్తున్నట్లు అందిన సమాచారంతో సెబ్ సిబ్బంది దాడి చేశారు. ఈ సందర్భంగా బురుజుకాడపల్లెకు చెందిన ఎస్. రఫీబాషా సారా కలిగి ఉండగా అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడిలో సెబ్ ఎస్ఐ లక్ష్మీనరసయ్య, సిబ్బంది సుధాకర్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబసమస్యలతో వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వివాహితలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మండలంలోని వేంపల్లెకు చెందిన శ్రీనివాసులు భార్య కే.వరలక్ష్మి(35) బుధవారం ఇంటివద్దే నిద్రమాత్రలు మింగింది. అదేవిధంగా చంద్రాకాలనీకి చెందిన రమేష్ భార్య డి.హేమమాలిని(26) పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మదనపల్లె తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని వృద్ధురాలి మృతి



నారాయణమ్మ మృతదేహం

మదనపల్లె : ద్విచక్రవాహనం ఢీకొని శతాధిక వృద్ధురాలు మృతిచెందిన సంఘటన మంగళవారం రాత్రి వాల్మీకిపురం మండలంలో జరిగింది. చింతపర్తి గ్రామానికి చెందిన లక్ష్మణాచారి భార్య నారాయణమ్మ(102) రోడ్డుపై నడిచివస్తుండగా బైక్ వేగంగా వచ్చి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. బాధితురాలిని కుటుంబసభ్యులు 108 వాహనంలో వాల్మీకిపురం కమ్యూనిటీ వైద్యశాలకు తరలించారు. చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆస్పత్రికి వచ్చేలోపు ఆమె మృతిచెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి బుధవారం కుటుంబసభ్యులకు అప్పగించారు. వాల్మీకిపురం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సర్వేయర్‌పై సస్పెన్షన్ ఎత్తివేత



బాధ్యతలు చేపట్టిన భువనేశ్వరి

కురబలకోట : కురబలకోట మండల సర్వేయర్ గుండ్లూరి భువనేశ్వరిపై సస్పెన్షన్ ఎత్తివేస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆమె తిరిగి కురబలకోట మండల సర్వేయర్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టారు. సర్వేలో భాగంగా ఎఫ్ లైన్‌లు సకాలంలో చూడడం లేదన్న కారణంపై సర్వేయర్ భువనేశ్వరిని ఈ ఏడాది జూలై 14న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సస్పెండ్ చేశారు. దీనిపై ఆమె తన సస్పెన్షన్ అక్రమమని రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించింది. విచారించిన హైకోర్టు తిరిగి ఆమెను అదే మండలంలో విధుల్లో చేర్చుకోవాలని సర్వే అండ్ ల్యాండ్స్ రికార్డ్స్ రాష్ట్ర కమిషనర్ సిద్ధార్థ జైన్‌కు ఆదేశాలు జారీ చే సింది. దీంతో ఆమెపై సస్పెన్షన్ ఎత్తి వేశారు.

కమనీయం..రంగనాథుడి కల్యాణం



పులివెందుల: స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

పులివెందుల టౌన్ : శ్రీరంగనాథస్వామి కల్యాణం కమనీయంగా జరిగింది. వైఎస్సార్ జిల్లా పులివెందుల సమీపంలోని ఆలయంలో నూలు పూజ పవిత్రోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామి కల్యాణాన్ని ప్రధాన అర్చకులు కృష్ణరాజేష్ శర్మ ఆధ్వర్యంలో సాయిభరద్వాజ్ శర్మ శాస్త్రోక్తంగా నిర్వహించారు. సతీసమేతుడైన శ్రీరంగనాథుని ముగ్ధమోహన రూపాన్ని చూసి భక్తులు తరించారు.పురోహితులు మంగళ సూత్రాలను భక్తులకు చూపించి స్వామివారి చేతికి తాకించి అమ్మవార్ల మెడలో వేశారు. చల్లా వంశీయులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా వైఎస్సార్‌సీపీ నేత వైఎస్ మనోహర్‌రెడ్డి హాజరై పూజాకార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధర్‌రెడ్డి, ఆలయ ఈఓ జీవీ రమణ, శ్రీరంగనాథస్వామి, అంకాలమ్మ ఆలయాల చైర్మన్లు సుధీకర్‌రెడ్డి, బ్యాటరీ ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

హంసవాహనంపై శ్రీరంగనాథుడు : నూలుపూజ పవిత్రోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీరంగనాథుడు సతీసమేతుడై హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో కొలువుతీరిన స్వామివారిని భక్తులు దర్శించి తరించారు. భక్తులు కాయ, కర్పూరాలను సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు.

ఐదుగురు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు



స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు



టాస్క్‌ఫోర్సు పోలీసుల అదుపులో నిందితులు

- 20ఎరచ్రందనం దుంగలు, వాహనాలు స్వాధీనం
- నిందితులు తమిళనాడువాసులు
- వివరాలు వెల్లడించిన టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ జి. చెంచుబాబు

తిరుపతి మంగళం : శేషాచల అడవుల్లో నుంచి అక్రమంగా తరలిస్తున్న 20 ఎర్రచందనం దుంగలతో పాటు ఐదుగురు స్మగ్లర్లను అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ జి. చెంచుబాబు తెలిపారు. అన్నమయ్య జిల్లా సుండుపల్లి వద్ద పింఛా డ్యాంకు సమీపంలో ఎరచ్రందనం దుంగలను కారులో లోడ్ చేస్తున్న ఐదుగురిని అరెస్టు చేసి, వారి నుంచి 20ఎరచ్రందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన ఎర్రచందనంతో పాటు స్మగ్లర్లను తిరుపతి టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి తీసుకొచ్చి కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ జి. చెంచుబాబు మాట్లాడుతూ రిజర్వు ఇన్స్పెక్టర్ కే.సురేశ్ కుమార్ రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐ విశ్వనాథ్ బృందం అన్నమయ్య జిల్లా సానిపాయ రేంజ్, జిల్లేళ్ల మంద అటవీ పరిధిలోని పింఛా డ్యాం వద్ద గత రెండు రోజులుగా కూంబింగ్ నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆ ప్రాంతంలో బుధవారం ఒక కారులో ఎరచ్రందనం దుంగలను లోడ్ చేయడాన్ని చూసి వారిని చుట్టుముట్టి 20 ఎర్రచందనం దుంగలతో పాటు తమిళనాడు తిరువణ్ణామలై జిల్లా పోలూరు తాలూకాకు చెందిన బాలు (36), సీ.కష్ణన్ (30), వేలూరు జిల్లా ఆనైకట్టుకు చెందిన ప్రభు శంకరన్ (29), ప్రభు జయరామన్ (33), ఎస్. అరుల్ (20)లను అరెస్టు చేశారన్నారు. వీరు ఎర్రచందనాన్ని తరలించేందుకు ఉపయోగించిన కారు, మూడు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారన్నారు. ఎరచ్రందనం దుంగలను ఎఫ్ఆర్ఓ ఏ.ప్రేమ ధృవీకరించి, టాస్క్‌పోర్సు పోలీసు స్టేషన్ ఎస్ఐ మోహన్ నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు. వీటి విలువ రూ.కోటి వరకు ఉండవచ్చునన్నారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న సిబ్బందిని కర్నూల్ రేంజి డీఐజీ సెంథిల్ కుమార్ అభినందించి, రివార్డులు ప్రకటించారు.

జీపీఎస్ బిల్లు ఆమోదం సరికాదు

కడప ఎడ్యుకేషన్ : ఉద్యోగ, ఉపాధ్యాయ ఆకాంక్షలకు వ్యతిరేకంగా జీపీఎస్ బిల్లును శాసనసభలో ఆమోదించడం సరికాదని, ఇది ఉద్యోగులకు చీకటి రోజు అని యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ్‌కుమార్, పాలం మహేష్‌బాబు అన్నారు. బుధవారం కడపలోని యూటీఎఫ్ భవన్‌లో వారు మాట్లాడారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రవికుమార్, నరసింహారావు, ట్రెజరర్ నరసింహారావు నాయకుడు శివరాంలు పాల్గొన్నారు.

రాష్ట్ర చరిత్రలో చీకటి రోజు

కడప ఎడ్యుకేషన్ : సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల జీవితాలను అంధకారంలోకి నెడుతూ జీపీఎస్‌ను శాసనసభలో ఆమోదించిన ఈ రోజు రాష్ట్ర చరిత్రలో చీకటిరోజుగా మిగిలిపోతుందని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కడపలోని వీవీఆర్ ఎస్టీయూభవన్‌లో ఆయన మాట్లాడారు. ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వడం ప్రభుత్వాల బాధ్యత అని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు చెబుతుంటే దానిని కూడా పెడచెవిన పెట్టి నియంతృత్వ ధోరణితో జీపీఎస్‌ను శాసనసభలో ఆమోదించడం సరికాదన్నారు.

రోడ్డుప్రమాదంలో ఆరుగురికి గాయాలు





గాయపడిన ప్రసన్న, బోగాదమ్మ



ఆటో డ్రైవర్ చిన్న

వేంపల్లె : పట్టణ పరిధిలోని హనుమాన్ జంక్షన్ వద్ద ఆటోను హిందుస్థాన్ పెట్రోలియం ట్యాంకర్ బుధవారం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. తాటిమాకులపల్లె, కదిరేపల్లె గ్రామాలకు చెందిన 10 మంది సొంత పనులు నిమిత్తం వేంపల్లెకు వచ్చారు. తిరిగి స్వగ్రామాలకు వెళుతుండగా ప్రమాదం జరిగింది. ఆటోలోని ప్రసన్న, బోగాదమ్మ, బాలగంగన్న, ఆటో డ్రైవర్ చిన్న, లక్ష్మమ్మ, మరొకరికి గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 ద్వారా వారిని వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అందులో ముగ్గురికి తీవ్రగాయాలు కావడంతో వైద్యుల సూచన మేరకు కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు. . ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సోలార్ సిస్టమ్‌తో విద్యుత్ ఖర్చు ఆదా



సోలార్ పవర్ ప్రాజెక్టును ప్రారంభిస్తున్న ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాస మూర్తి

కడప కార్పొరేషన్ : రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్ ద్వారా విద్యుత్ ఖర్చులను ఆదా చేయొచ్చని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాస మూర్తి అన్నారు. బుధవారం కొప్పర్తిలో ట్రయోవిజన్ కాంపోజిట్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఇన్‌స్టాల్ చేసిన 120 కిలోవాట్ రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఫ్యాక్టరీల విద్యుత్ అవసరాలు తీర్చడానికి సౌర శక్తిని ఉపయోగించడం ద్వారా 1.5లక్షల యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చన్నారు. ఆర్బ్ ఎనర్జీ వైస్ ప్రెసిడెంట్ రామకృష్ణ మాట్లాడుతూ ట్రయో విజన్ కాంపొజిట్ టెక్నాలజీస్ వారు 120 కిలోవాట్ రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్‌ను డిజైన్, సరఫరా, ఇన్‌స్టాల్ చేయడానికి ఆర్బ్ ఎనర్జీని ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు.

బాల్య వివాహం అడ్డగింత

లింగాల : లింగాల మండలం మురారిచింతల గ్రామంలో బుధవారం రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు.గ్రామస్తులు సమాచారం అందించడంతో అధికారులు గ్రామానికి వెళ్లారు. బాలిక తల్లిదండ్రులు, వారి బంధువులను లింగాల తహసీల్దార్ కార్యాలయానికి తీసుకొచ్చారు. తహసీల్దార్ లక్ష్మినారాయణ, పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ ప్రభాకర్‌లు వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇంటర్మీడియట్ చదువుతున్న 16 సంవత్సరాల బాలికకు వివాహం చేయడం నేరమని తెలిపారు. 18 సంవత్సరాలు నిండే వరకు పెళ్లి చేయరాదని తల్లిదండ్రులతో అంగీకారపత్రాన్ని రాయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరస్వతి, డిప్యూటీ తహసీల్దార్ త్రిభువన్‌రెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

సెంట్రల్ జోన్ జట్టు విజయం



హర్షవర్ధన్ (112 పరుగులు)



రోహిత్ (91 పరుగులు)

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన ఏసీఏ అండర్-23 అంతర్ జోనల్ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో సెంట్రల్‌జోన్ జట్టు విజయం సాధించింది. వర్షం కారణంగా వాయిదా పడిన మ్యాచ్‌ను బుధవారం నిర్వహించగా, మ్యాచ్‌లో నార్త్‌జోన్, సెంట్రల్ జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన సెంట్రల్‌జోన్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 364 పరుగులు చేసింది. జట్టులోని రోహిత్ 91 పరుగులు, కార్తికేయ 74 పరుగులు చేశారు. నార్త్‌జోన్ బౌలర్ వంశీనారాయణ 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నార్త్‌జోన్ జట్టు 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 263 పరుగులు మాత్రమే చేయగలిగింది. జట్టులోని హర్షవర్ధన్ 112 పరుగులు, రాహుల్ 77 పరుగులు చేశారు. దీంతో సెంట్రల్‌జోన్ జట్టు 101 పరుగుల తేడాతో విజయం సాధించింది.

ట్రూఅప్ చార్జీలను ఎత్తివేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వామపక్ష నేతలు

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ప్రభుత్వం ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ బిల్లుల భారాలు వేస్తోందని వామపక్ష పార్టీలు బుధవారం కలెక్టరేట్ వరకు ప్రదర్శనగా వచ్చి ధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా సీపీఐ, సీపీఎం, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్, రెవెల్యూషనరి సోషలిస్టు పార్టీ, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శులు చంద్ర, చంద్రశేఖర్, డబ్ల్యూ రాము, రమణయ్య, సుబ్బరాయుడు, జయవర్ధన్‌లు మాట్లాడుతూ ట్రూఅప్ చార్జీలను వెంటనే ఎత్తివేయాలని కోరారు. సెల్‌ఫోన్లకు రీఛార్జిలాగా విద్యుత్ బిల్లులకు రీఛార్జి పద్ధతి తీసుకు రావడం సరికాదన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఆలోచన ఉపసంహరించుకోవాలన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 2022లో బీజేపీ ప్రభుత్వం విద్యుత్ బిల్లు చట్టం తెచ్చిందని పేర్కొన్నారు. ఫిక్స్‌డ్ ఛార్జీలు, సర్వీస్ ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, ఇంధన సర్దుబాటు ఛార్జీలు పేరుతో ప్రజలను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సావంత్ సుధాకర్‌రావు, వెంకట శివ, కేసీ బాదుల్లా, హేతువాద సంఘం నాయకులు సీఆర్‌వీ ప్రసాద్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు శ్రీనివాసులు, లోక్‌సత్తా నాయకుడు దేవర కృష్ణ, కాంగ్రెస్ నాయకుడు సత్తార్, సీపీఎం రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అడ్వెంచర్ టూరిజం' విశిష్టమైనది



పర్వతారోహకులతో వైవీయూ అధికారులు

వైవీయూ : పర్యాటక రంగంలో 'అడ్వెంచర్ టూరిజం' విశిష్టమైనదని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు, వైవీయూ ఆర్ట్స్ విభాగం డీన్ ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో 'పర్వతారోహకుల పరిచయ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచంలోని ప్రఖ్యాత పర్వతాలను అధిరోహించిన జి. సురేష్‌బాబు, వి. శ్రీలత, రేపల్లె సుందరరాజు, గానుగపెంట హరిప్రసాద్‌లను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పర్యాటకం అనేది మనిషి మానసిక ఆనందం కోసం ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి సంచారం చేయడమేనని, అందులో భాగంగా ప్రాణాలకు తెగించి సాహసోపేతంగా చేసే పర్వతారోహణమనేది ప్రాముఖ్యత సంతరించుకుందన్నారు. పర్వతారోహకుడు సురేష్‌బాబు మైనస్ 20 డిగ్రీల ఉష్ణోగ్రతను తట్టుకునేలా కఠినశిక్షణ పొంది తన 18వ ఏట 8848 మీటర్ల ఎత్తుగల ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన యువకెరటమన్నారు. దీంతో పాటు 8516 మీటర్ల ఎతైన పర్వతాలెక్కి ఆయన సత్తా చాటారన్నారు. నంతరం పర్వతారోహకులు సురేష్‌బాబు, శ్రీలత, రేపల్లె సుందరరాజు, గానుగపెంట హరిప్రసాద్‌లు పర్వతారోహణలో ఎదురయ్యే ఇబ్బందులను వివరించారు.వైవీయూ పాలకమండలి సభ్యుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా మాట్లాడారు. కార్యక్రమంలో వైవీయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఎన్. వెంకటరామిరెడ్డి, సీపీ బ్రౌన్ భాషాపరిశోధన కేంద్రం భాషా పరిశోధన కేంద్రం సలహామండలి సభ్యులు జానుమద్ది విజయభాస్కర్, గానుగపెంట హనుమంతరావు, మొగిలిచెండు సురేష్, భూపతిరాయల్, కొత్తపల్లి రామాంజనేయులు వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

లారీ, ట్రాక్టర్ ఢీ : ఒకరి మృతి



జాతీయ రహదారిపై బోల్తా పడిన ట్రాక్టర్



జేష్టాది రాజేంద్ర మృతదేహం

దువ్వూరు : మండల పరిధిలోని మీర్జాఖాన్‌పల్లె వద్ద కడప- కర్నూలు జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున లారీ - ట్రాక్టర్ ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు నెల్లూరు జిల్లా ఆత్మకూరు నుంచి ఎరువుల బస్తాల లోడుతో నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు వెళుతున్న ట్రాక్టర్‌ను కోలార్ నుంచి నంద్యాలకు క్యాబేజీ లోడుతో వెళుతున్న లారీ వేగంగా వెనుక నుంచి ఢీకొంది. దీంతో రెండు వాహనాలు బోల్తా పడ్డాయి. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న జేష్టాది రాజేంద్ర (43) అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రసాద్, హరి గాయపడ్డారు. దువ్వూరుకు చెందిన జేష్టాది రాజేంద్ర వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇతనికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఇదే గ్రామానికి ప్రసాద్, హరి, జేష్టాది రాజేంద్రలు ట్రాక్టర్‌లో ఎరువుల బస్తాలను లోడ్ చేసేందుకు వెళ్లారు. నెల్లూరులో ట్రాక్టర్‌కు ఎరువుల బస్తాలను లోడ్ చేసుకుని ఆళ్లగడ్డకు వెళుతుండగా ప్రమాదం జరిగింది. రాజేంద్ర మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మూర్తి తెలిపారు.

భవ్యశ్రీ హంతకులను కఠినంగా శిక్షించాలి



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నిరసన తెల్పుతున్న ప్రజాసంఘాల ఐక్యవేదిక నేతలు

రాయచోటి అర్బన్ : చిత్తూరు జిల్లా పెనుమూరు మండలానికి చెందిన మైనర్ బాలిక భవ్యశ్రీని ప్రేమపేరుతో తీసుకెళ్లి గ్యాంగ్‌రేప్‌నకు పాల్పడి హతమార్చిన మానవమృగాలను కఠినంగా శిక్షించాలని రాయచోటి ప్రజాసంఘాల ఐక్యవేదిక నేతలు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ చిత్రపటం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 17వతేదీన తమ కుమార్తె కనిపించడం లేదంటూ భవ్యశ్రీ తల్లితండ్రులు పెనుమూరు ఎస్ఐకి ఫిర్యాదు చేసినప్పటికీ అతను స్పందించలేదన్నారు. ఎస్ఐ సకాలంలో స్పందించి అనుమానితులపై చర్యలు తీసుకుని ఉంటే భవ్యశ్రీ ప్రాణాలతో బయట పడేదన్నారు.కార్యక్ర మంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక నేతలు టి.ఈశ్వర్, రామాంజనేయులు, మారుతిశంకర్, కుంచపు రెడ్డెయ్య, చల్లా రెడ్డెయ్య, రమణ, రమేష్,అక్బర్‌అలీఖాన్, న్యాయవాదులు నాగార్జున,రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆవును కాపాడిన ఫైర్ సిబ్బంది



కాలువలో నుంచి ఆవును జేసీబీ సహాయంతో పైకి తీసుకువస్తున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది

మదనపల్లె : మేత మేసేందుకు వెళ్లి సుమారు 10అడుగులకు పైగా లోతైన మురుగుకాలువలో పడిపోయిన పాడి ఆవును బుధవారం అగ్నిమాపకశాఖ సిబ్బంది కాపాడారు. పట్టణంలోని నిమ్మనపల్లె రోడ్డు ఆర్.వి.కాలనీకి చెందిన రైతు సి.వెంకటరమణ రూ.60వేల విలువచేసే జెర్సీ పాడిఆవును మేత కోసం కాలనీలో విడిచిపెట్టాడు. ఆవు మేత మేస్తూ ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న మురుగుకాలువలో పడిపోయింది. కాలువ ఎత్తుగా ఉండటంతో పైకి రాలేకపోయింది. దీంతో కంగారుపడ్డ రైతు వెంకటరమణ అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫైర్ ఆఫీసర్ శివప్ప ఆధ్వర్యంలో ఘటనాస్థలానికి చేరుకున్న సిబ్బంది జేసీబీ, తాళ్ల సహాయంతో సుమారు అరగంటకు పైగా శ్రమించి ఆవును సురక్షితంగా పైకి తీసుకువచ్చారు. కార్యక్రమంలో అగ్నిమాపకసిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి తాళం



తహసీల్దార్ కార్యాలయానికి గేట్లు వేసి నిరసన తెలుపుతున్న రైతు చంద్రనారాయణరెడ్డి

లింగాల : లింగాల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ప్రధాన గేటుకు బుధవారం గ్రామానికి చెందిన తేరా చంద్రనారాయణరెడ్డి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. కొన్ని నెలలుగా చంద్రనారాయణరెడ్డికి శివశంకర్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి అనే రైతుల మధ్య రహదారి విషయమై తరచూ వాదోపవాదాలు జరిగేవి. పొలంలోకి వెళ్లడానికి తనకు దారిచూపాలని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగానని, అయితే అధికారులు పట్టించుకోకపోవడంతో గత్యంతరం లేక బుధవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయమై డిప్యూటీ తహసీల్దార్ త్రిభువన్ రెడ్డిని వివరణ కోరగా లింగాల గ్రామానికి చెందిన అలవలపాటి గోవిందరెడ్డి చనిపోవడంతో ఆయన కుమారుడు శివశంకర్‌రెడ్డి, దివాకర్‌రెడ్డిలు తమ తండ్రి పేరు మీద ఉన్న భూమిని వారి పేర్లపై బదలాయించాలని తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. అయితే అక్కడ ఉన్న భూ విస్తీర్ణంలోనూ, ఆన్‌లైన్‌లో నిక్షిప్తమైన భూమి విస్తీర్ణంలో తేడాలు ఉన్నాయని, తేరా చంద్రనారాయణ రెడ్డి పట్టాదారు పాసుపుస్తకంలో సుమారు 0.90సెంట్లు ఎక్కువ చూపిస్తోందన్నారు. అందువల్ల ఎక్కువ ఉన్న భూమిని తగ్గిస్తే కాని శివశంకర్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి పేర్లపై బదలాయించడం జరగదని చెప్పారు. ఈ విషయమై తేరా చంద్రనారాయణరెడ్డి పొలంలోకి వెళ్లేందుకు దారి కావాలంటూ అర్జీలు సమర్పించారు. అయితే విలేజ్ మ్యాప్‌లో ఆయనకు రహదారి ఉన్నట్లు చూపించలేదన్నారు. కనీసం సర్వే నిర్వహించేందుకు చలానాలు కట్టమని చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. ఇరు కుటుంబాల మధ్య దారి విషయమై జరిగిన వ్యక్తిగత గొడవలుసివిల్ న్యాయస్థానం ద్వారా పరిష్కరించుకోవాలని తహసీల్దార్ తెలిపార అన్నారు. ఇలాంటి కారణాల వల్ల చంద్రనారాయణరెడ్డి తహసీల్దార్ కార్యాలయానికి తాళం వేశారన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు.

ఎస్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాలకు అటానమస్ హోదా



కేక్ కట్ చేస్తున్న ఎస్ఆర్ఐటీ కాలేజీ నిర్వాహకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక సాయిరాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలకు 2023-24 విద్యా సంవత్సరం నుంచి అటానమస్ హోదా లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాండురంగన్ రవి తెలిపారు. బుధవారం అటానమస్ హోదా వచ్చిన సందర్భంగా కేక్ కట్ చేసి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలను ఏర్పాటు చేసి పది సంవత్సరాలు కావడం, యూజీసీ 2(ఎఫ్) గుర్తింపు, నాక్, ఎన్‌బీఏ అక్రిడిటేషన్, నాణ్యమైన విద్య అందిస్తుండటంతో స్వయం ప్రతిపత్తి గుర్తింపు వచ్చిందన్నారు. కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడు వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకళ్యాణ్‌రెడ్డిలు మాట్లాడుతూ తమ కళాశాలకు అటానమస్ హోదా లభించడం సంతోషదాయకమన్నారు.